క్లుప్తంగా

సైబర్ నేరస్తులతో జాగ్రత్త


ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె : మండల పరిధిలోని ప్రజలందరూ సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి మేము బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాము, మీ అకౌంట్ గానీ లేదా క్రెడిట్ కార్డు, ఆధార్ కార్డుగానీ రెన్యువల్ చేస్తాము మీకు ఓటీపీ వస్తుంది నెంబర్ చెప్పండని అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాధానం చెప్పకుండా జాగ్రత్త వహించాలని వారు తెలిపారు. ప్రజలు తమ ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతాలలో నగదు వేరే ఖాతాలకు బదిలీ అయినట్లుగా ఫోన్‌కు మెసేజ్ వస్తే వెంటనే కేంద్ర సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ 1930 నెంబర్‌కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసాన్ని వివరించాలన్నారు. అలాగే చేస్తే సైబర్ నేరస్తుల అకౌంట్ నుండి డబ్బులు డ్రా కాకుండా అడ్డుకునే వీలుంటుందని వారు తెలిపారు.

జూదరుల అరెస్టు

వీరబల్లి : మండలంలోని గురప్పగారిపల్లి పంచాయతీలోని మాదిరెడ్డిగారిపల్లి సమీపంలోని మామిడి తోటల్లో ఆదివారం కోడిపందెం ఆడుతుండగా సమాచారం మేరకు స్థానిక పోలీసులు కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. ముగ్గురు వ్యక్తులను, రెండు కోళ్లను స్వాధీనం చేసుకొని వారివద్ద నుంచి రూ. 2,850లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడి

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాటి వాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తమ సిబ్బందితోపాటు పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 14,350లు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నియామకం


పూల భాస్కర్

రాజంపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కో–ఆర్డినేటర్‌గా తనను నియమించారని పూల భాస్కర్ తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం విలేకరులతో సమావేశం నిర్వహించి భాస్కర్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తరపున ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతానని తెలియజేశారు.

ఉత్సవాలు ఐకమత్యానికి ప్రతీకలు


ప్రార్థనలు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

నందలూరు : నందలూరులో వెలసిన మగ్దూం బాబు ఉరుసు మహోత్సవం హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనమని రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి దర్గాలో నిర్వహించిన గంధం మహోత్సవానికి ఆయన హాజరై పూలచాందర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి మైనుద్దీన్ ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొబ్బిళ్ల త్రినాథ్, గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, నడివీధి సుధాకర్, అనుదీప్, జయహింస, ఇబ్బు, అజీజ్, అరిగె నాని, గుండు మల్లికార్జునరెడ్డి, మాహబూబ్‌బాషా, నాగసుబ్బయ్య, కాకి చంద్ర, ఆనాల మధు యాదవ్, మధురాజు, మాదాపూర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు


భిక్ష చేస్తున్న మాలధారులు

గాలివీడు : అయ్యప్ప మాలధారులకు ఆదివారం భిక్ష ఏర్పాటు చేసినట్లు సేవాభావం సంస్థ అధ్యక్షులు పి.ఆర్యశంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా కార్తీక మాసంలో స్థానిక పెద్దచెరువు కట్టపై ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చెయ్యడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇదే క్రమంలో నవంబర్ 8వ తేదీ నుండి డిసెంబర్ 1వ తేదీ కార్తీక మాసం పూర్తయ్యే వరకు రోజూ మధ్యాహ్నం భిక్ష అందిస్తామన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసియున్న శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ సేవలకు మంగళం!

- గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల్లో 545 రకాల సేవలు
- నేడు ఏమీ నమోదు చేసుకోవాలనుకున్న పని చేయని వెబ్‌సైట్లు
- కూటమి ప్రభుత్వం తీరుతో ప్రజల అసహనం


సచివాలయాల సముదాయాలు


సచివాలయాల వద్దే ఇంటి నివాస పత్రాలను అందజేస్తున్న అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

సంబేపల్లె : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యస్థాపనే లక్ష్యంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల చెంతకే సేవలు అందించాలనే ధ్యేయంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు. వీటికి అనుసంధానంగా వలంటీర్లను నియమించి ఇంటింటికి వెళ్లి సేవలు అందించారు. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే వలంటీర్లను పక్కనపెట్టేసింది. సచివాలయ ఉద్యోగాలను కించపరిచేలా విధులను అప్పగిస్తూ సచివాలయాల్లో అందే సేవలన్నీ నిలిచిపోయేలా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల్లో ప్రజలకు 545 రకాల సేవలకు అందుబాటులోకి తెచ్చింది. వీటికి అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లతోపాటు ప్రజలు నిత్యం అవసరమైన సేవలను ఇంటి ముంగిటికి తెచ్చారు. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలందించారు. సంబేపల్లె మండలంలో 12 సచివాలయాలు ఉండగా 101 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

అర్హులందరికీ పథకాలు..

గత ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రజలు నుంచి నిత్యం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు సచివాలయాలు పనిచేస్తు ఉండేవి. సామాజిక పింఛన్లు, నివాస స్థలాలు, బియ్యం కార్డులు, విద్యాదీవెన, అమ్మఒడి, వసతిదీవెన, ఆటోవాలలకు వాహనమిత్ర ఇలా పలు రకాల సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తూ అర్హులకు పథకాలందించడంలో కీలక పాత్ర పోషించేవి. ఆయా సచివాలయాల పరిధిలో పథకాల ద్వార ఎంత మందికి ఎంత సొమ్ము చెల్లించామనే వివరాలను స్పష్టంగా సచివాలయాల వద్ద బోర్డులు పెట్టిమరీ ప్రదర్శించేవారు, కానీ ఇప్పుడు అవి మచ్చుకు సైతం కనిపించని దుస్థితి నెలకొంది.

ప్రజలకు తప్పని కష్టాలు

కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతోనే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తూ వారిని ఇంటింకి తిప్పుతున్నారు. ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికి ప్రచారం చేస్తూ స్టిక్కర్లు అంటించే పనులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో 545 రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్‌లో నిక్షిప్తంచేసి ఆపై డాక్యుమెంటేషన్, అవసరమైన ధృవపత్రాలు జారీ చేసేవారు. ప్రస్తుతం జనన, మరణ, ధృవపత్రాలు తప్ప మరి ఏ పథకానికి సంబంధించి దరఖాస్తులు సచివాలయంలో చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు అత్యవసరమైన రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస స్థలాలు తదితర పథకాలకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్స్ ఓపెన్ కావడం లేదని వాపోతున్నారు. దీంతో మళ్లీ మండల కార్యాలయాలకు చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆపార్ నమోదుకు ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం లేక విద్యార్థులు, తల్లిదండ్రులు పట్టణాల్లోని, మీసేవ, పోస్టాఫీస్‌లు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది.

సేవలందక అవస్థలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా సంక్షేమ పథకాల ఊసేలేదు. సచివాలయం ద్వార గత ప్రభుత్వం అందించిన సేవలు సైతం నిలిపివేయడంతోపాటు ప్రజలకు నిత్యవసరమైన కొత్తరేషన్ కార్డులు, చేర్పులు మార్పులు, నివాస స్థలం తదితర పథకాలక దరఖాస్తులు పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. సచివాలయాల్లోనే ప్రజా సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సుబ్బరాయుడు, శెట్టిపల్లె, సంబేపల్లె మండలం

సేవలను పునరుద్ధరించాలి



గత ప్రభుత్వంలో సచివాలయాల ద్వార ఎన్నో సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. అవసరాల నిమిత్తం ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగకుండా వలంటీర్లతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో సేవలేమి అందడంలేదు. ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉన్న సచివాలయాలను నిర్వీర్యం చేయడం మంచి పద్ధతి కాదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గతంలో మాదిరిగా సచివాలయాల ద్వార ప్రజలకు సేవలందించాలి.

– శివరామ్, సంబేపల్లె మండలం

ఘనంగా ముద్దల పండుగ


గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సిద్దవటం : మండల కేంద్రంలోని గాంధీవీధిలో ఆదివారం గంగమ్మ ముద్దల పండుగను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. గంగమ్మకు గాంధీవీధి వాసులు ప్రతి ఏడాది కార్తీక మాసంలో ముద్దల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి గుడిని పూలతో అలంకరిచి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి బోనాలు, కాయాకర్పూరాలను సమర్పించారు. మరికొందరు అమ్మవారికి కోడిపుంజులు, మేకపోతులు బలిచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానికులు అంకాలమ్మ గుడివద్దకు వెళ్లి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

సారూ.. బియ్యం ఎప్పుడిస్తారూ?

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డి పంచాయతీ షాపు నెంబర్ ఒకటవ షాపు పరిధిలోని లబ్ధిదారులకు ఇంత వరకు బియ్యం అందలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలనెలా అందాల్సి బియ్యం ఇంతవరకు గ్రామానికి రాకపోవడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. బియ్యం ఎప్పుడు వస్తాయి సారూ.. అంటూ అసహనానికి గురవుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వర్లను వివరణ కోరగా ఆ షాపునకు సంబంధించి గ్రామంలోని డీలర్‌కు వెంటనే బియ్యం అందజేసి తద్వార లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలియజేశారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట టౌన్ : విద్యార్థులు ఆరోగ్యవంతమైన పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని గరల్స్ హైస్కూల్‌లో కడప రెడ్డిసేవా సమితి రజతోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఆ సమితి ప్రతినిధులు రాజంపేట డివిజన్ స్థాయిలో వేమన పద్యపోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం ఎంతో ప్రధానమైనదని తెలిపారు. ఇలాంటి పద్యపోటీలు విద్యార్థుల్లో మంచి నడవడిక, సంస్కారం అలవడేందుకు దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ దశలో విద్యార్థులు చదువుపైనే ధ్యాస ఉంచాలని సూచించారు. కడప రెడ్డి సేవా సమితి ప్రతినిధులు వేమనపద్య పోటీలు నిర్వహించి నగదు బహుమతులను ప్రదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈపోటీల్లో డివిజన్‌లోని వివిధ మండలాలకు చెందిన మూడు వందల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులకే కాక వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే ఆకేపాటి భోజన సౌకర్యం కల్పించారు. కాగా ఈ పోటీల్లో రాజంపేట పట్టణం శ్రీవిద్యానికేతన్ పాఠశాలకు చెందిన కుమారి, దీపిక, ఆసీఫలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలను రెడ్డిసేవాసమితి ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిసేవా సమితి ప్రతినిధులు లెక్కల కొండారెడ్డి, కె.నాగిరెడ్డి, గుడ్ల ఆదినారాయణరెడ్డి, శ్రీయపురెడ్డి, శివనారాయణరెడ్డి, పోటీల సమన్వయకర్త గంగనపల్లె వెంకటరమణ, న్యాయ నిర్ణేతలుగా కొత్త నరసింహులు, బీవీ నాగరాజు, బుట్టా రామచంద్రయ్యానాయుడు, శ్రీదేవి, యూపీ రాయుడు, నాగార్జునలు వ్యవహరించారు.

భక్తులకు అన్న ప్రసాదం

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందించారు. కార్తీక మాసం కావడంతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యం కల్పించారు. స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు వందలాదిగా రావడంతో ఈ సౌకర్యం కల్పించినట్లు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి తెలిపారు. కార్తీక మాసం అన్ని రోజులు ఇలాగే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చిట్వేలి : చిట్వేలి శ్రీ సాయి ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ శ్రీ కృష్ణాస్ హాస్పిటల్ రాజంపేట వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. ఇందులో డాక్టర్ శ్రీకృష్ణ జనరల్ సర్జన్, మాలేపాటి డాక్టర్ శ్రీ విద్య, ఈఎన్టీలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 125 మంది వైద్య శిబిరంలో పాల్గొన్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య మాట్లాడుతూ వైద్య శిబిరం నిర్వహించిన హాస్పిటల్ వారికి రోగులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, బడ్జెట్ కేటాయించి పరిష్కరించాలని 104 ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు తమ సమస్యల పరిష్కారం కోసం 104 ఉద్యోగులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఓట్లు వేయించుకున్న టీడీపీ నేతలు తాము అధికారంలోకి వచ్చి 5 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు ఇస్తున్న అరకొర జీతాలు ఏమాత్రం చాలడం లేదన్నారు. జీఓ నం–7 ప్రకారం కనీసవేతనాలు రూ. 26వేలకు పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తుండడం దారుణమంటూ చెప్పారు. 104 ఉద్యోగులు రమేష్, బాబు, మురళి, నాగిరెడ్డిలు మాట్లాడుతూ అరబిందో సంస్థ యాజమాన్యం తమ పీఎఫ్ బకాయిలు ఖాతాలలో జమ చేయడం లేదని, ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలంటూ కోరారు. 104 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. 104 వాహనాలకు ప్రమాదబీమా ఉండదని, అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే డ్రైవర్లకు ప్రమాదబీమా కింద రూ. 25లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. 104 వాహనాల రిపేర్లు సైతం డ్రైవర్లే చేయించుకోవలసి వస్తోందని, వెంటనే మరమ్మతుల బిల్లులను చెల్లించాలంటూ కోరారు. వాహన రిపేరు ఖర్చులకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. 3 ఏళ్లుగా ఇవ్వని ఇంక్రిమెంట్‌లను అరియర్స్ రూపంలో భేషరతుగా విడుదలచేసి తమను ఆదుకోవాలంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెలాఖరు నుంచి సమ్మెలోకి వెళతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు రాజు, విశ్వనాథ రెడ్డి, నాగార్జున, వినయ్, వంశీ, విశ్వనాథ్, రాము, సోము, శ్రీనివాసులు, రాజశేఖర్, మోహన్, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ జరపాలి

పీలేరు రూరల్ : కేవీపల్లె మండలం గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థి రెడ్డి మోక్షిత్ మృతి సంఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, ప్రిన్సిపాల్, పీఈటీ నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. విద్యార్థి మృతి చెందిన విషయం తల్లిదండ్రులకు తెలియజేయడంలో జాప్యం చేయడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. విద్యార్థి మృతిపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చల్లంగా చూడు మా తల్లీ గంగమ్మా


లక్కిరెడ్డిపల్లి: దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ


సంబేపల్లె: అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : గంగమ్మ దేవత వర్షాలు కురిపించి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా కరుణించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మ కు భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ దర్శనం కోసం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించారు.

నల్ల గంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెన్షనర్ల న్యాయపరమైన సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీసీ రెడ్డెన్న డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి డైట్ కేంద్రంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్‌సీలో కోల్పోయిన అదనపు పెన్షన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. 40 శాతం కమ్యూటేషన్ రికవరీని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. అలాగే 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి తద్వారా ఐఆర్ ప్రకటించాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు బీవీ రమణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్‌సీ అరియర్స్‌ను త్వరగా మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన హెల్త్‌కార్డులకు అన్ని రకాల జబ్బులకు అన్ని ఆస్పత్రులలో చెల్లే విధంగా ఉత్వర్వులు ఇవ్వాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డికుమార్ డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని జిల్లా ఆర్థిక కార్యదర్శి జయచంద్రారెడ్డి కోరారు. రాయచోటి పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు చెంగల్‌రెడ్డి, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, నారాయణ స్వామి, రామచంద్ర, రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకేపాటికి ఆహ్వానం


ఆకేపాటికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ప్రతినిధులు

రాజంపేట రూరల్ : శ్రీసద్గురు సాయినాథ మందిరం 25వ వార్షికోత్సవాలకు విచ్చేయవల్సిందిగా ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆహ్వానించారు. మండల పరిధిలోని ఆకేపాడు ఎస్టేట్‌లో ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆకేపాటిని కలిసి ఈ నెల 17వ తేదీన జరిగే వార్షిక ఉత్సవాలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎస్.శివరాజు, బి.నరసారెడ్డి, బి.ధనంజయ, కె.సుబ్బరామిరెడ్డిలు ఉన్నారు.

ఓ జ్ఞాపకంలా గడియారం!

- గడియారాలకు తగ్గుతున్న ఆదరణ
- వాచ్‌లను మింగిన సెలఫోన్‌లు
- కనుమరుగవుతున్న దుకాణాలు


వాచ్ షాపులోని సెల్ఫ్‌లో ఉంచిన వాచ్‌లు


బూతద్దంలో చూస్తూ వాచ్‌ను రిపేర్ చేస్తున్న మెకానిక్ అబ్దుల్ అజీజ్

రాజంపేట రూరల్ : సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కే కొద్దీ పాత వాటికి గిరాకీ తగ్గుముఖం పడుతోంది. కొత్తనీరు వస్తే పాత నీరు పోయినట్లు అధునిక సదుపాయాలకు ప్రజలు అలవాటు పడటంతో పాత వాటి మీద ఆధారపడి జీవించేవారు ఉపాధి కోల్పోతున్నారు. గతంలో ఇటువంటి వెలుగు వెలిగిన వాటిలో గడియారం ఒకటని చెప్పవచ్చు. గతంలో చేతికి వాచీ ధరిస్తే అది ఒక హందాగా భావించేవారు. వాచీ పెట్టుకున్న వ్యక్తికి అప్పట్లో అదొక మర్యాద. గోడ గడియారం ఇంటిలో ఉందంటే వారి ఇంటిని మిగతా వారు ప్రత్యేకంగా చూసేవారు. ఈ వాచీలను విక్రయించే షాపులు పట్టణాలలో పదుల సంఖ్యలో ఉండేవి. వాటికి మరమ్మతులు చేసేవారు వీధికొకరు ఉండేవారు అంటే అతిశయోక్తి కాదేమో. వాచ్ ప్రజలకు కాలాన్ని తెలిపే యంత్రంగా బాగా ప్రాచుర్యం పొందింది. ఎంతలా అంటే ఈ వాచ్‌లను రిపేర్ చేసే వర్క్ నేర్చుకోవడానికి వయసుతో నిమిత్తం లేకుండా అధిక శాతంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ఉత్సాహపడేవారు. వాచ్ మెకానిక్‌లము అనే కాలరెగరేసేవారు. అదే జీవనాధారంగా జీవనం సాగించేవారు. 2000 సంవత్సరంలో సెల్‌ఫోన్‌లు అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ వాచ్‌ల గిరాకీ తగ్గలేదు. 2002 సంవత్సరంలో సెల్‌ఫోన్‌లు వాటి రూపాంతరం మార్చుకొని మధ్యతరగతి వారికి అందుబాటులోకి వచ్చాక వాచ్‌ల వాడకం తగ్గుముఖం పట్టింది. 2004 సంవత్సరంలో ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లను సామాన్యుడికి చేతికి ఎప్పుడు వచ్చాయో వాచ్‌లకు కాలం చెల్లిందని చెప్పవచ్చు. చేతికి వాచ్‌లు కనుమరుగయ్యాయి. షాపులు పట్టణాలలో 2, 3కే పరిమితమయ్యాయి. మరమ్మతులు చేసే మెకానిక్‌లు ఇతర వృత్తులను జీవనాధారంగా ఎంచుకొన్నారు.

గతంలో గడియారం వాడకం ఘనం

గత 20 సంవత్సరాల క్రితం వరకు గడియారాల వాడకం ఘనంగా ఉండేది. ముందుగా ప్రతి 24 గంటలకు ఒక పర్యాయం కీ ఇచ్చుకోవల్సి వచ్చేది. గోడ గడియారానికి సైతం వారానికి ఒక పర్యాయం కీ ఇస్తే సరిపోయేది. ఇవి దశాబ్దాలపాటు పని చేసేవి. అనంతరం వచ్చిన బ్యాటరీ వాచ్‌లు కీ ఇవ్వకున్నా పనిచేసేవి. నేటి ఎల్రక్టానిక్ వాచ్‌లు సంవత్సరానికి అటు ఇటుగా పనిచేసే పరిస్థితి నెలకొంది. గోడ గడియారాల సంగతి సరేసరి. మూలనపడ్డాయి.

నేడు వాచ్ అంటే వాడుకోని వదిలివేసేదే

నేటి మార్కెట్‌లో లభిస్తున్న ఎల్రక్టానిక్ వాచ్‌లలో వాడుకొని వదిలేసేటివే అధికం. రిపేర్ చేసుకునేందుకు సహకరించవు. గతంలో అయితే వాచ్ పనిచేయకుంటే రిపేర్ చేసేందుకు అనువుగా ఉండేవి. ముఖ్యంగా ఓవర్ ఆయిల్ చేస్తే సరిపోయేది. నాటి వాచ్‌లకు ప్రధానంగా కీరాడ్, వాచ్‌పై గ్లాస్‌లు, ముల్లులు వంటివి ఎక్కువగా రిపేర్‌కు వస్తూ ఉండేవి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎల్రక్టానిక్ వాచ్‌లకు ఇటువంటి సమస్యలు తలెత్తవు. మన్నిక తక్కువగా ఉన్నప్పటికీ బ్యాటరీలు మార్చుకుంటే సరిపోతుంది. లేనిపక్షంలో వాచ్‌ను వదిలివేయాల్సిందేగా ఉండటంతో మెకానిక్‌లు కనుమరుగయ్యారు. ఎక్కడైనా ఇదే జీవనాధారంగా ఇప్పటికీ జీవించే వారు ఉంటే వారు వాచ్ షాపు ఎదుట చిన్న చెక్కబల్ల వేసుకొని మరమ్మతులు చేస్తున్నారని చెప్పవచ్చు. కొన్ని చోట్ల షాపుల యజమానులే మరమ్మతులు చేస్తున్నారు. అతి చిన్నవిగా ఉండే వాచ్‌లోని భాగాలను బిగించడానికి వీరు కళ్లకు ఏర్పాటు చేసే భూతద్దం చూపరులను ఆకట్టుకుంటుంది. కానీ ఈ భూతద్దం ధరించిన మెకానిక్ కంటి చూపుపై ఎక్కువ ప్రభావితం చూపుతుంది.

సెల్‌ఫోన్ మయం

గతంలో అన్ని వర్గాల వారు ఉదయం నిద్ర లేచేందుకు వాచ్‌లో అలారం పెట్టుకుని రాత్రి ప్రశాంతంగా నిద్రించేవారు. నేడు అంతా సెల్‌ఫోన్ మయంగా ప్రజలు జీవనం సాగిస్తున్నారంటే అతిశయోక్తి కాదేమో. ప్రపంచంలోని ప్రతి విషయం కనుగొనేందుకు ఈ సెల్‌ఫోన్ ఉపయోగపడటంతో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోనే లోకం అన్నట్లుగా జీవస్తున్నారు. ఈ సెల్‌ఫోన్ మింగేసిన వాటిలో ప్రప్రథమమైనది వాచ్ అని పెద్దలు అభిప్రాయపడుతున్నారు.


60 ఏళ్లుగా వాడుతున్నాను



నేను 60 సంవత్సరాలుగా గడియారం వాడుతున్నాను. నేను 60 సంవత్సరాలుగా నా చేయికి గడియారం పెట్టుకుంటున్నాను. గడియారం లేకుంటే నాకు ఏదో వెలితిగా ఉంటుంది. మా కాలం నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో రకాల గడియారాలు మార్కెట్‌లోకి వచ్చాయి. నేను అన్ని రకాల గడియారాలను వాడాను. ఇప్పటికీ నాకు గడియారం ఉండాల్సిందే. సెల్ కన్నా నాకు గడియారం ఎక్కువ ఇష్టం.

– చప్పిడి సుబ్బారెడ్డి, ఎర్రబల్లి, రాజంపేట మండలం

గడియారం లేకుంటే నిద్రపట్టదు



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి గడియారం వాడుతున్నాను. చేతికి గడియారం లేకుంటే నాకు నిద్ర కూడా పట్టదు. నేను ఎక్కడికి వెళ్లినా గడియారం నా చేతికి తప్పక ఉంటుంది. గతంలో వాచ్‌లు వానకు తడిసినా చెడిపోయేవి కావు. ఇప్పటి గడియారాలకు రేటు ఎక్కువ అయినప్పటికీ చానా రోజులు ఆడటంలేదు. అంతా సెల్‌ఫోన్‌లు వాడటం ఎక్కువ అవటంతో గడియారాల రేటు పెరిగింది.

– వెంకటేశు, దొండ్లోపల్లి, పుల్లంపేట మండలం